## క్లుప్తంగా

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీ ఉమా మహేశ్వర కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య కంచికట్టు వాసుదేవరావు పర్యవేక్షణలో బిందు యోషిత, హర్షిణి, సుప్రియరెడ్డి, చైత్రిక, గీతిక, హర్షిణిలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. వాసుదేవరావుతో పాటు చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించి అభినందించారు.

### రెండు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని సెయింట్ జోసఫ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కృష్ణా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక ఓసీ, మరొక పోస్టుకు ఎస్సీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి వైజాగ్‌కు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. వైజాగ్ మహారాణిపేటకు చెందిన ములగడ వాణి జానకీ లక్ష్మి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి రూ.1,00,116ల విరాళాన్ని అందజేయగా, ఆలయ మర్యాదలతో దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

### కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని శిఖా సాహిత్య మెగా మ్యూజిక్స్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు సాహిత్య అన్నారు. శిఖా సాహిత్య మెగా ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ మినీ హాల్‌లో సోమవారం సినీ సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి, సినీ సంగీత విభావరితో పాటు గాయనీ గాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య మాట్లాడుతూ కళాకారులను గౌరవించుకోవాలని సూచించారు. వాఖ్యాత సురేష్ మాట్లాడుతూ ఘంటసాల లాంటి గాయకుడు దొరకడం భగవదత్తమైన వరం అన్నారు. ఘంటసాల స్వరం ప్రతి తెలుగు వారి ఇంట్లో వినిపిస్తూ ఉంటుందని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలు ఆలపించారు. గాయనీ గాయకులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, చింతకాయల చిట్టిబాబును సత్కరించారు.

### ముస్లిం మైనార్టీ హక్కుల కోసం పోరాడాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆజాద్ ముస్లిం కమిటీ (ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. ఏఎంసీ తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జిగా పఠాన్ ఫిరోజ్ ఖాన్, మాడుగుల నియోజకవర్గం ఇన్‌చార్జిగా షేక్ నాగూర్‌బాషాను నియమిస్తూ సింగ్‌నగర్‌లోని ఆ కమిటీ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ ఏఎంసీలోని ప్రతి నాయకులు, సభ్యుడు ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం కష్టపడాలని.. నిరుపేద ముస్లింలకు సహాయపడేలా సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జనవరి 19న విజయవాడలో జరగబోయే ఏఎంసీ 7వ వార్షికోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. షేక్ సాజిద్ అలీ, షేక్ మస్తాన్ వలీ, ఎండీ రఫీ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ఇన్నర్ రింగ్‌రోడ్డు

- భారీ వాహనాలతో తరుచుగా ప్రమాదాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి




ప్రమాదాలకు నిలయంగా మారిన ఇన్నర్ రింగ్‌రోడ్డు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పైపుల రోడ్డు నుంచి వైవీ రావు ఎస్టేట్ రింగ్‌ల మధ్య నిర్మించిన ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో వేగాన్ని నిరోధించేందుకు ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో పగటి వేళ లారీలు, రాత్రి వేళ ఆకతాయిలకు అడ్డాగా మారడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. భారీ వాహనాలు, లారీలు, ఇసుక టిప్పర్లు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలో పలువురు ప్రాణాలను కోల్పోగా, మరి కొందరు గాయాల పాలయ్యారు.

### నిత్యం రద్దీనే... !

జక్కంపూడి కాలనీతో పాటు పాముల కాల్వ, అంబాపురం ప్రాంతాలకు చెందిన వారు నగరంలోకి రావాలన్నా, వారు తమ ఇళ్లకు వెళ్లాలన్నా ఎక్కువగా ఇన్నర్ రింగ్‌నే ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీగా తక్కువగా ఉండటంతో పాటు అతి తక్కువ సమయంలో నగరంలోని ప్రధాన ప్రాంతాలకు చేరుకునే వీలు ఉండేది. కాలనీలో అత్యధిక సంఖ్యలో జనం నివాసం ఉండటంతో పాటు వారు ఎక్కువగా సింగ్‌నగర్‌లోని వాంబేకాలనీ, పైపుల రోడ్డుకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే ఆటోల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. దీనికి తోడు ఇన్నర్ రింగ్ రోడ్డులో ఎక్కువ సంఖ్యలో హోటళ్లు, దాబాలతో పాటు బైక్, లారీ మెకానిక్ షెడ్డులు వెలిశాయి. దీంతో ఆయా దుకాణాలు, హోటళ్లు, మెకానిక్‌ల షెడ్డుల ఎదుట ఇష్టానుసారంగా లారీలు, ఇతర వాహనాలను నిలిపివేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన నెల రోజుల వ్యవధిలో కొత్త రాజరాజేశ్వరిపేటకు చెందిన యువకుడు మరణించడంతో పాటు మరో యువకుడు తీవ్రగాయాల పాలయ్యారు.



ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)

నాలుగు రోజుల కిందట పాముల కాల్వ వద్ద ఉదయం 10 గంటల సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడిని టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాలనీకి చెందిన మరో యువకుడు రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా టిప్పర్ అతని పైనుంచి వెళ్లడంతో మృతి చెందిన ఘటన ఇన్నర్ రింగ్ రోడ్డులో చోటుచేసుకుంది.

### డివైడర్ ఎత్తు కారణం..

ఈ రోడ్డులో అత్యధికంగా ప్రమాదాలు జరగేందుకు డివైడర్ ఎత్తు కూడా కారణమేనని ఇటీవల ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. వైవీ రావు ఎస్టేట్ నుంచి పైపుల రోడ్డుకు వెళ్లే వరకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఎత్తు 6 అంగుళాలకు మించి ఉండదంటే అతిశయోక్తి కాదు. డివైడర్ ఎత్తు తక్కువగా ఉండటంతో రోడ్డుపై ప్రయాణించే వారు ఆకస్మత్తుగా కుడి వైపు మలుపు తిప్పడం, రోడ్డుకు అవతలి వైపు వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించ లేకపోవడంతోనూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.

### రాత్రి 10 దాటితే హడలే..

ఇన్నర్ రింగ్ రోడ్డు ఇటు కొత్తపేట పోలీస్ స్టేషన్‌తో పాటు నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంది. రాత్రి 10 గంటల తర్వాత ఇటు వైవీ రావు ఎస్టేట్ నుంచి పైపుల రోడ్డు వరకు అంతర్గత రోడ్లలో వాహనాలను నిలిపి మద్యం సేవించడంతో వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. రాత్రి 10 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాలను అనుమతించకపోవడంతో ఇన్నర్ రింగ్‌రోడ్డులోని వైవీ రావు ఎస్టేట్ వద్ద లారీలు, ఇతర వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో రోడ్డుకు దిగువన ఎటువంటి కార్యకలాపాలు సాగించినా రోడ్డుపై వెళ్లే వారికే కాదు పోలీసులకు సైతం కనిపించే అవకాశం లేదు. ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జక్కంపూడి కాలనీ వాసులతో పాటు సింగ్‌నగర్ వాసులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించే ప్రతి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లోనూ జరిగింది. సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2 కార్యాలయంలో కమిషనర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యను శాఖాధిపతులే స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి సమస్యలను తెలుసుకుని సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో స్వీకరించిన ఫిర్యాదులు, వాటిపట్ల శాఖాధిపతులు అనుసరించిన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా..**

మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని ఇతర జోనల్ కార్యాలయాల్లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ ధ్యానచంద్ర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. శాఖాధిపతులు ఫీల్డ్‌లోకి వెళ్లి అప్పుడు ఉన్న పరిస్థితి, సమస్య పరిష్కరించిన తరువాత పరిస్థితిని ఫొటోలతో జత పరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను నిర్దేశించారు. నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 14 ఫిర్యాదులు అందాయన్నారు. అందులో టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 9, రెవెన్యూ 3, ఇంజినీరింగ్ సెక్షన్‌కు చెందిన 2 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సర్కిల్ - 2 కార్యాలయంలో జోనల్ కమిషనర్-2 ప్రభుదాస్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ - 2 ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ - 2 శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో దుర్గమ్మ ప్రచార రథం



రాజవొమ్మంగిలో గ్రామోత్సవం



ప్రచార రథానికి స్వాగతం పలుకుతూ కోలాట నృత్యాలు చేస్తున్న మహిళలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ప్రచార రథానికి ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు ఘనస్వాగతం పలికారు. వంచంగి, జి.కొత్తపల్లి, చికిలింత, దోసరపాము, రాజవొమ్మంగి, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలకు అమ్మవారి ప్రచార రథం చేరుకోగా, స్థానికంగా ఉన్న ప్రజలు రథానికి హారతులిచ్చి స్వాగతం పలికారు. అమ్మవారి ప్రచార రథం చేరుకున్న గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని ఆలయాల వద్ద మామిడి తోరణాలు కట్టి ఉత్సవాలను నిర్వహించారు. దుర్గగుడి అర్చకులు ప్రచార రథంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు భవానీ దీక్షల గురించి తెలియజేశారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను భక్తులకు వివరించారు.

## యువతతోనే మెరుగైన సమాజ స్థాపన

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్



యవతకు దిశా నిర్దేశం చేస్తున్న ఇంతియాజ్, వేదికపై హజరత్తయ్య గుప్తా, నారాయణరావు

విజయవాడకల్చరల్: యువత నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రా లయోలా కళాశాల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలోని సెమినార్ హాల్లో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవినీతి అంతం అదే మనపంతం అంశంగా కవి సమ్మేళనం, సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మెరుగైన సమాజస్థాపన యువతతోనే సాధ్యమన్నారు. యువత సమాజంలో నైతిక విలువలు పెంపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అవినీతి లేని సమాజం యవత భవితకు సోపానన్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ నేడు సమాజంలో అవినీతి వేయి శిరస్సుల కాలనాగులా విజృంభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటామని యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. లయోలా కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ జి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ 70 సంవత్సరాల క్రితం ఇదే రోజు లయోలా కళాశాలస్థాపనకు బీజం పడిందని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కళాపోషకుడు గోళ్ళ నారాయణరావు, గాంధీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ గాంధీ నాగరాజు, డాక్టర్ సమరం తదితరులు అవినీతి రహిత భారతం యువత కర్తవ్యం అంశంగా ప్రసంగించారు. పినాకినీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.మురళీ మోహన్‌రాజు, కళాశాల తెలుగు సంస్కృత శాఖాధిపతి డాక్టర్ కె.శేఖర్, కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు. మహిళలు అవినీతి అంతం ఇదే మనపంతం అంశంగా స్వీయ కవితాగానం చేశారు.

## రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయండి



నైజాం గేట్ వద్ద డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం 37, 54, 55 డివిజన్లలోని కెనాల్ రోడ్, గాంధీబొమ్మ సెంటర్, వించిపేట, నైజాం గేట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కెనాల్ రోడ్‌లో పైప్‌లైన్ల కోసం తవ్విన రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి భవానీ దీక్షలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. మెయిన్ బజార్ వద్ద జరుగుతున్న ఎల్‌అండ్‌టీ నిర్మాణ పనులను కాళేశ్వరరావు మార్కెట్ వరకు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఎస్కలేటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి..**

అనంతరం 55వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. క్యూరింగ్ కోసం తీసుకునే చర్యలను పటిష్టంగా ఉండేలా చూసుకుని నాణ్యతా ప్రమాణాలలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గం ఉండేటట్లు చర్యలు తీసుకుని రోడ్డు వేయాలని ఆదేశించారు. అనంతరం నైజాం గేట్ వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించి ఎస్కలేటర్‌ను తక్షణమే మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో జరుగుతున్న డీ సిల్టింగ్ పనులను పరిశీలించారు. నాలామాన్ తీస్తున్న డ్రెయిన్లలో అవసరమైన చోట్ల గ్రేటింగ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్‌కు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## ముగిసిన సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, శ్రీ స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు త్యాగరాజ స్వామి పరంపరకు చెందిన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141 వ జయంతి సందర్భంగా శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారం ముగిసాయి. పారుపల్లి వద్ద సంగీతాభ్యాసం చేసి పద్మశ్రీ పురస్కారం స్థాయికి చెందిన వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి స్వీయరచనలతోపాటు సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలు మధురంగా పలికించారు. బ్రోచేవారెవరే, వాతాపి గణపతిం, సుజన జీవన తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. వయోలిన్‌పై బీవీ దుర్గా భవానీ , మృదంగంపై పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, ఘటంపై హరిబాబు సహకరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావాణిలో 65 ఫిర్యాదులు



ఫిర్యాదితో మాట్లాడుతున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి) కార్యక్రమంలో 65 మంది నుంచి డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, మోసాలు, దొంగతనాలపై ప్రజలు తనకు ఫిర్యాదులు ఇచ్చినట్లు డీసీపీ తెలిపారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించానని చెప్పారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని షాలేము మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్, సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా షాలేము మినిస్ట్రీస్ నిర్వహించిన మెగా బైబిల్ పరీక్షల్లో గెలిచిన విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా నగదు బహుమతి అందజేసి, వారిని సత్కరించారు. వేడుకల్లో షాలేము మినిస్ట్రీస్ దైవజనులు రెవరెండ్ సత్యవేదం పుట్ల, క్షేమాబాయ్ పుట్ల, రెవరెండ్ శామ్యూల్ సుమంత్ పుట్ల, పాస్టర్లు రేమల్లి ఆనంద్, విజయకర్, విజయచందర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా, శానిటేషన్, నైట్ వాచ్ మెన్‌లకు ఐదు మాసాల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హరికృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల, కళాశాలల ఆయా, శానిటేషన్, వాచ్‌మెన్ వర్కర్స్ యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు కోనేరు లక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా బడ్జెట్‌లో 2024-25 సంవత్సరాలకు సంబంధించి ఆయా, వాచ్‌మెన్, శానిటేషన్ వర్కర్స్ వేతనాలు కోసం రూ.6,43,840 అలాగే టాయిలెట్ క్లీనింగ్ కోసం రూ.2,35,203లను కేటాయించి జీవోలు విడుదల చేశారని తెలిపారు. నెలకు కేవలం ఆరు వేలు ఇచ్చి రోజంతా పని చేయించుకోవటమే కాకుండా ఐదు మాసాల నుంచి జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వీరిని ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. డీఈవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. నేతలు జి.లక్ష్మి, సీహెచ్ కౌశలయ్య, మరియమ్మ, కేవీ రమణ, ఆసియా తదితరులు పాల్గొన్నారు

## రూ.36.66 లక్షలకు ప్రసాదం కవర్ల విక్రయ హక్కు



టెండర్లు పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ ప్రసాదాల కౌంటర్ల వద్ద క్లాత్ కవర్లు విక్రయించుకునే హక్కు కోసం దేవస్థానం సోమవారం టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. రూ.36.66 లక్షలకు ప్రసాదం కవర్ల విక్రయ హక్కు ఖరారైంది. మహామండపం ఆరో అంతస్తులో ఏఈఓ దుర్గారావు పర్యవేక్షణలో ఆలయ సూపరింటెండెంట్ నగేష్ టెండర్ ప్రక్రియ నిర్వహించారు. ప్రసాదాల కౌంటర్ల వద్ద క్లాత్ కవర్లను విక్రయించే హక్కుకు టెండర్లు ఆహ్వానించగా నలుగురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ టెండర్ ప్రక్రియ ద్వారా టెండర్లు ఆహ్వానించారు. బహిరంగ వేలంలో దేవస్థానం పాటను రూ.27 లక్షలుగా నిర్ణయించి పాటను ప్రారంభించారు. గత నెల 14న కవర్లు విక్రయించుకునే హక్కు కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.27 లక్షల వరకు వేలం జరిగింది. ఈఓ కె.ఎస్.రామారావు ఆ టెండర్‌ను రద్దు చేశారు. తాజాగా నిర్వహించిన వేలం ప్రక్రియలో రూ.27 లక్షల నుంచి దేవస్థానం పాటను ప్రారంభించగా, శ్రీరామ ఎంటర్ ప్రైజర్స్ రూ.33.05 లక్షలతో హెచ్చుపాటదారుడిగా నిలిచింది. అనంతరం ఆలయ అధికారులు సీల్డ్ టెండర్లు తెరిచారు. దేవి ఎంటర్ ప్రైజర్ రూ.30.33 లక్షలు, సహార స్పోర్ట్స్ రూ.36.51లక్షలు, శ్రీరామ ఎంటర్ ప్రైజర్స్ రూ.36.66 లక్షలు కోట్ చేశారు. సీల్డ్ టెండర్‌లోనూ శ్రీరామ అధిక మొత్తానికి టెండర్ దాఖలు చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

**పూసల దండల సేకరణకు..**

భవానీ దీక్షల్లో భక్తులు అమ్మవారికి సమర్పించే పూసల దండలను సేకరించుకునేందుకు పురుషోత్తం అనే వ్యక్తి రూ.6.05 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. గత ఏడాది రూ.5.55 లక్షలు పలకగా, ఈ ఏడాది రూ.50 వేలు అదనంగా ఆదాయం లభించింది. ఈ టెండర్ల వ్యవహారాన్ని ఆలయ ఈఓ రామరావుతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.





## ఆకట్టుకున్న పాలిటెక్ ఫెస్ట్

ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024 సోమవారం నిర్వహించారు. విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన టెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాజెక్టులను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ